క్లుప్తంగా

తైక్వాండో క్రీడాకారులకు అభినందన



తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో కలెక్టర్ కృతికా శుక్లా

నాగమల్లితోట జంక్షన్: డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ సీనియర్స్ తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆమెను కోచ్ అర్జునరావు ఆధ్వర్యంలో క్రీడాకారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఐదు రజత, ఒక కాంస్య పతకం సాధించడం జిల్లాకు గర్వ కారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్, కోచ్ అర్జునరావు, జాతీయ స్థాయి రిఫరీలు సత్యనారాయణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



స్విమ్మింగ్ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ నాని

నాగమల్లితోట జంక్షన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌లో కాకినాడ స్విమ్మర్లు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. నగరానికి చెందిన మేధ యశస్విని అండర్-9 కేటగిరీలో కిక్ బోర్డ్‌లో బంగారు, బటర్ ఫ్లైలో కాంస్య పతకాలు సాధించింది. మోస హర్షవర్ధన్ కిక్ బోర్డులో కాంస్య పతకం పొందాడు. వీరిద్దరూ స్థానిక వివేకానంద పార్కు ఆవరణలోని మున్సిపల్ చిల్డ్రన్స్ స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ నాని వద్ద ఏడాదిగా శిక్షణ పొందుతున్నారు.

పిక్నిక్‌లతో ఆహ్లాదం

కాకినాడ రూరల్: ఆహ్లాదానికి పిక్నిక్‌లు దోహదపడతాయని, అవి మధుర జ్ఞాపకాలను మిగుల్చుతాయని మానసిక విశ్లేషకుడు ఏపీజే విను అన్నారు. ఆదివారం సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ పిక్నిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజీ జీవితాల మధ్య ప్రియమైన వారితో కొద్ది సమయం గడిపేందుకు పిక్నిక్‌లు దోహదపడుతున్నాయన్నారు. కార్తిక మాసంలో జరిగే వన సమారాధనలు పిక్నిక్ లాంటివే అని అన్నారు. కార్యక్రమంలో రేలంగి బాపిరాజు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన అతిథులు, అడబాల ట్రస్ట్ ప్రతినిధులు

కాకినాడ రూరల్: పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ కొప్పిశెట్టి సురేష్, అనిత దంపతుల సహకారంతో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, యనమల రామం, ఏపీజే విను, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కుమార్ యాదవ్, కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం..



కావమ్మ ఆలయంలో భక్తులతో మాట్లాడుతున్న కమలానంద భారతీస్వామి

సామర్లకోట: గన్నవరం శ్రీభువనేశ్వరీ పీఠానికి చెందిన కమలానంద భారతీస్వామి ఆదివారం సామర్లకోటలోని వివిధ ఆలయాలను సందర్శించారు. స్థానిక ఏలూరు కాలువ రజకపేట వద్ద వేంచేసి ఉన్న కావమ్మ ఆలయాన్ని సందర్శించి ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. హిందూ ఐక్య సంఘ నియోజకవర్గ నాయకుడు జీవీకే మోహనరావు, కావమ్మ ఆలయ కమిటీ సభ్యులు సుకపల్ల బాబ్జి, నాగరాజు, మారయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బలుసులపేట రామాలయంలో కమలానంద స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన స్వామికి కౌన్సిలర్ నేతల హరిబాబు స్వాగతం పలికారు.

రండీ... చదువుకుందాం

- నగర ఐడియల్ కళాశాలలో 18 హానర్స్ కోర్సులు
- 19 నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ



ప్రాక్టికల్స్ చేస్తున్న ఆక్వాకల్చర్ కోర్సు విద్యార్థులు



కాకినాడలో ఐడియల్ కళాశాల

బాలాజీచెరువు (కాకినాడసిటీ): సరికొత్త విద్యకు నాంది పలికింది.. జాతీయ విద్యా విధానంలో భాగంగా కొత్త కోర్సులు చదివేందుకు అవకాశం వచ్చింది.. పాత విద్యా విధానం, సంప్రదాయ కోర్సులకు స్వస్తి పలికి భారత ప్రభుత్వం ఆమోదించిన నూతన జాతీయ విద్యా విధానం (NEP-2020)లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త హానర్స్ డిగ్రీని ప్రవేశపెట్టింది. కాకినాడలో పేరొందిన కళాశాల ఐడియల్ (అటానమస్) కళాశాలకు ఈ అవకాశం చేజిక్కింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో న్యాక్ గుర్తింపు పొందిన తొలి కళాశాల ఇదే కావడం విశేషం. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఐడియల్ కళాశాలలో నూతన కోర్సులను ప్రవేశపెట్టామని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి వివరించారు. పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకుని తమ భవితకు బంగారు బాటలు వేయడానికి కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి 18 హానర్స్ కోర్సులను ప్రారంభించింది. గత మూడేళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అగ్రికల్చర్, ఫుడ్ సైన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి కోర్సులను ప్రారంభించడంతో ఇప్పటికే అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయోజనం పొంది వివిధ పేరున్న సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించారు. అదే విధంగా ఈ విద్య సంవత్సరం 18 హానర్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఐడియల్ కళాశాల ఇంద్రపాలెం (సామర్లకోట రోడ్) క్యాంపస్‌లో 8 కోర్సులు, విద్యుత్‌నగర్ క్యాంపస్‌లో 10 రీస్ట్రక్చర్డ్, స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు నిర్వహిస్తారు. దీనికోసం ఈ నెల 19 నుంచి 24 వరకూ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. 26 నుంచి 30 వరకూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. జులై 3న సీట్లు కేటాయిస్తారు. అనంతరం 4 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

వంద శాతం ఉద్యోగావకాశాలు



ఈ ఏడాది కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమల్లోకి వచ్చింది. జిల్లాలో అత్యధిక కోర్సులున్న కళాశాల ఇదే. వంద శాతం ఉద్యోగ అవకాశాలు ఉండే కోర్సులకు ప్రాధాన్యం కల్పించాం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో హానర్స్ డిగ్రీ పూర్తి చేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన సాగిస్తున్నాం. ప్రాంగణ ఎంపికలు నిర్వహించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

– డాక్టర్ పి.చిరంజీవిని కుమారి, కరస్పాండెంట్, ఐడియల్ కళాశాల

న్యాక్-బి గుర్తింపు

ఐడియల్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సెల్ (న్యాక్) గుర్తింపు ఉంది. సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు పాఠాలు సులువుగా అర్థం చేసుకునేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా బోధన అందిస్తున్నారు. 24 గంటల గ్రంథాలయం వినియోగంతో పాటు వివిధ మల్టీనేషనల్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. 2022-23లో 300 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు పొందగా ప్రారంభ వేతనం ఏడాదికి రూ.3.50 లక్షల నుంచి పొందుతున్నారు. ప్రభుత్వం అందజేసే జగనన్న విద్యాదీవెన వంటి పథకాలు విద్యార్థులకు కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి.

విభాగం	కోర్సు	సీట్లు
బీఏ (హానర్స్)	ఎకనామిక్స్	30
బీఏ (హానర్స్)	పొలిటికల్ సైన్స్	30
బీకామ్ (హానర్స్)	జనరల్	60
బీకామ్ (హానర్స్)	జనరల్ (ఈ-కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్)	60
బీకామ్ (హానర్స్)	కంప్యూటర్ అప్లికేషన్స్	110
బీఎస్సీ (హానర్స్)	మ్యాథమెటిక్స్	50
బీఎస్సీ (హానర్స్)	కెమిస్ట్రీ	76
బీఎస్సీ (హానర్స్)	జువాలజీ	46
బీఎస్సీ (హానర్స్)	అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్	60
బీఎస్సీ (హానర్స్)	ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్	48
బీఎస్సీ (హానర్స్)	కంప్యూటర్ సైన్స్	96
బీఎస్సీ (హానర్స్)	ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్	48
బీఎస్సీ (హానర్స్)	ఫిషరీస్	50
బీఎస్సీ (హానర్స్)	ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ	48
బి.ఒకేషనల్ (హానర్స్)	ఫిషరీస్	50
బీసీఏ (హానర్స్)	బీసీఏ	50
బీబీఏ (హానర్స్)	డిజిటల్ మార్కెటింగ్	60
బీబీఏ (హానర్స్)	జనరల్	60

అన్న పేరుతో ఎదిగిన వాడిని కాదు

- ప్రతి ఆరోపణకూ సమాధానమిస్తా..
- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- పవన్‌కల్యాణ్ తీరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: పవన్‌కల్యాణ్‌లా అన్న పేరో... తండ్రి పేరో చెప్పుకొని రాజకీయాల్లోకి రాలేదని, తనకంటూ ఓ గుర్తింపు ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డీ కన్వెన్షన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. కాకినాడలో చదివి విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో కొనసాగి జెండా మోసి మెట్టు మెట్టు ఎక్కా.. ఇక్కడే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా.. ఉగాది పచ్చడిలా తీపి, చేదు, ఒగరు అన్నీ చూశా.. నాపై లేనిపోని నిందలు వేస్తే చూస్తూ ఊరుకోనని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన సమయంలో సమాధానం చెబుతానంటూ వరుస సభల్లో పవన్‌కల్యాణ్ చేస్తోన్న విమర్శలపై ద్వారంపూడి స్పందించారు. పవన్‌కల్యాణ్ చేస్తోన్న ప్రతి వ్యాఖ్యకు సమాధానం ఇస్తానని.. కాకినాడ సభలో ఆయన మాట్లాడిన తీరును బట్టి స్పందిస్తానన్నారు. కాకినాడలో 33 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన 27 వేల మంది ఉన్నారన్నారు. త్వరలోనే వీరందరికీ ఇళ్లు నిర్మించే ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. నిబద్ధతతో పనిచేసే ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని, ఆయన వద్ద ఎమ్మెల్యేగా కొనసాగి ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టడం మరింత సంతృప్తిగా ఉందన్నారు.

మనోభావాలు దెబ్బతీయొద్దు

- పవన్‌కల్యాణ్‌పై కాపు నేతల మండిపాటు



మాట్లాడుతున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న

కాకినాడ: వారాహి యాత్ర సందర్భంగా జిల్లాలోని ప్రతి సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై నోటికొచ్చినట్లు మాట్లాడడం ద్వారా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కాపుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని పలువురు కాపు నేతలు మండిపడ్డారు. స్థానిక డీ-కన్వెన్షన్‌లో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడారు. పవన్‌కల్యాణ్ తన సభల్లో ద్వారంపూడిని విమర్శించడం తగదన్నారు. గతంలో ద్వారంపూడి ఇంటిపై వీర మహిళలు దాడికి యత్నించారన్నారు. ఈ క్రమంలో తాము ప్రతిఘటిస్తే ఆ చర్యను వీర మహిళలపై దాడిగా పవన్‌కల్యాణ్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ సరైన అజెండా, దిశానిర్దేశం లేని పవన్‌కల్యాణ్ ఈ ప్రాంత కాపు కులస్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం మానుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాపులను, కాపు మహిళలను అత్యధిక పదవుల్లో నియమించి అగ్రపీఠం వేసిన ఘనత ద్వారంపూడికే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇనుకొండ పట్టాభిరామయ్య మాట్లాడుతూ నగరంలోని అత్యధిక శాతం కాపులు 30 ఏళ్లుగా ద్వారంపూడి వెన్నంటే ఉన్నారన్నారు. పార్టీ నాయకుడు రాజారపు మహేష్ మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా నోరుపారేసుకోవడం పవన్‌కు తగదన్నారు. మరో సీనియర్ నాయకుడు ఎన్వీ సాయిబాబా మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా హుందాగా మెలగాలని హితవు పలికారు. జిల్లా లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు దుగ్గన బాబ్జి మాట్లాడుతూ ముద్రగడ, జక్కంపూడి వంటి కాపు ప్రముఖుల అడుగుజాడల్లో నడుస్తూ తమ ప్రతి కష్టంలోనూ వెన్నంటే ఉన్న ద్వారంపూడి వెంట ప్రయాణించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, కాపు సామాజికవర్గ ప్రతినిధులు ముమ్మిడి గోవిందు, ముమ్మిడి శ్రీను, బెండా విష్ణు, పసుపులేటి శేఖర్, కొలగాని దుర్గాప్రసాద్, పెద్దిరెడ్డి రామలక్ష్మి పాల్గొన్నారు.

త్వరలో 'ద్వారంపూడికి తోడుగా బీసీలు'

- కాకినాడలో బహిరంగ సభ ఏర్పాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు

కాకినాడ: బీసీల సంక్షేమం కోసం శ్రమిస్తూ, ప్రతి కష్టంలో తోడుగా నిలుస్తున్న సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా త్వరలోనే 'ద్వారంపూడికి తోడుగా బీసీలు' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీసీ నేతలు ప్రకటించారు. స్థానిక డీ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన బీసీ నేతలు మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా సుమారు 50 వేల మందితో ఈ సభ నిర్వహిస్తామని, త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నుంచి సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి వరకూ తమ పరిధిలోని బీసీలకు అగ్రస్థానం కల్పించి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ శెట్టిబలిజ, మత్స్యకార, నాయీబ్రాహ్మణ, గౌడ, రజకులు, యాదవులు సహా ప్రతి ఒక్క బీసీ సామాజిక వర్గానికి ఎమ్మెల్యే ద్వారంపూడి సముచిత ప్రాధాన్యం కల్పించారన్నారు. చేనేత సంఘాల ప్రతినిధి పంపన రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బీసీలకు ఎప్పుడూ ఇవ్వనంత ప్రాధాన్యం సీఎం జగన్ పాలనలో దక్కిందని, 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు మత్స్యకార నాయకుడు అంకాడి సత్తిబాబు మాట్లాడుతూ నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భరోసా, ఆయిల్ సబ్సిడీ, రేవు ఆధారిత కార్మికుల భవిష్యత్ కోసం ఎమ్మెల్యే ఎంతో తోడ్పాటు ఇస్తున్నారన్నారు. మరో మత్స్యకార నాయకుడు వాసుపల్లి కృష్ణ మాట్లాడుతూ చంద్రశేఖరరెడ్డి చొరవ వల్లే మత్స్యకార ప్రాంతాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. రజక సంఘాల ప్రతినిధి ఇరుసుమల్ల విష్ణు మాట్లాడుతూ రజకులతో పాటు అన్నివర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఇక్కడ ఎమ్మెల్యే చేస్తోన్న కృషికి బీసీలంతా సమష్టిగా మద్దతు ఇవ్వాలని కోరారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన బీసీ నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నడకుదురులో గడప గడపకూ..



నడకుదురులో లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. అర్హత ఉండి ఏ పథకమైనా అందకపోతే గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదివారం నడకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యులు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోమాటి ఏసుబాబు, పైలా గోవిందు, దాలిపర్తి శ్రీనివాస్, పోతల లోవప్రసాద్, యెడ్ల కృష్ణార్జున తదితరులు ఆయన వెంట సాగారు. ఎమ్మెల్యే కన్నబాబు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వాటి ఎంతమేర ప్రయోజనం పొందారో ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ప్రజలు కోరగా, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రొక్కాల గణేష్, పెంకే సత్తిబాబు, రొక్కాల తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి

తుని రూరల్: మండలం హంసవరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్) ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 11న పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితాల వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఆధార్ కార్డు, ఐదో తరగతి స్టడీ సర్టిఫికెట్ల జెరాక్స్‌ను పాఠశాలలో అందజేయాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత వీపీఎల్ జట్టు



విజేత జట్టుకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు సూచించారు. మండలంలోని వాకతిప్పలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నీలో 12 టీములు పాల్గొనగా విజేతగా వీపీఎల్ జట్టు నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కీడాకారులను ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ సంబరం



సంబరంలో భక్తజన కోలాహలం

పెద్దాపురం: ఆషాఢ మాసంలో ఏటా జరిగే మరిడమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం పెద్దాపురం చేపల వీధి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక గంగాభవాని ఫిషర్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరానికి భక్తులు పోటెత్తారు. గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, బ్యాండ్ మేళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను కలసిన ఆర్డీఓ



జస్టిస్ సీతారామమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడకు వచ్చిన ఏపీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తిని ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్డీఓ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ పి.సీతాపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దీపక్ ఉన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ



వడ్డి రోహన్ శివతేజ

కరప: ఆల్ ఇండియా జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కరప గ్రామానికి చెందిన వడ్డి రోహన్ శివతేజ 2,261వ ర్యాంక్ సాధించాడు. అతని తల్లిదండ్రులు సత్యకుమారి, వెంకటేశ్వరరావులు ఇద్దరూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. సివిల్స్‌కు ప్రిపేరై ఐఏఎస్ కావడం తన లక్ష్యమని శివతేజ తెలిపారు. దీనికోసం నిరంతరం శ్రమిస్తానన్నారు.

కుటుంబానికి రక్షకుడు నాన్నే..



సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: పిల్లల వెన్నంటే ఉంటూ రక్షణ ఇచ్చేది నాన్న మాత్రమేనని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ముఖ్యపాత్ర తండ్రిదేనన్నారు. అతను పిల్లలకు ఒక గైడ్‌గా, స్నేహితుడిగా, రోల్ మోడల్‌గా ఉంటాడన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, న్యాయవాది యనమల రామం, కొమ్మూరి శ్రీనివాసరావు, డాక్టరు కుమార్ యాదవ్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

కాకినాడ కల్చరల్: పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవ ఆనంద్ మాట్లాడుతూ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జగదీష్, శ్రీరామచంద్రమూర్తి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం



పదోన్నతి పొందిన రైల్వే సిబ్బందిని సత్కరించిన స్టేషన్ మేనేజర్, తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే పాయింట్స్ మెన్‌లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు రైల్వే గూడ్స్ గార్డులుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆదివారం వారిని స్థానిక రైల్వే స్టేషన్‌లో మేనేజర్ ఎం.రమేష్ ఘనంగా సత్కరించారు. ఆరుగురు పాయింట్స్ మెన్‌లకు 60 శాతం ప్రమోషన్ కోటాలో గూడ్స్ గార్డులుగా పదోన్నతి లభించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు 50 రోజుల శిక్షణ నిమిత్తం సికింద్రాబాద్‌లోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు వారికి రిలీఫ్ మెమోలు అందజేసి అభినందించారు. రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, రైల్వే సూపరింటెండెంట్ శ్రీధర్, అనంతలక్ష్మి, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు అమరయ్య ఘనపాఠి, యనమండ్ర శర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ అర్చకుడు ప్రభాకర శాస్త్రితో పాటు 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.